మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి

ఉచితంలోనూ వసూల్

- ఎన్‌టిఆర్ వైద్య సేవలో ప్రయివేటు ఆస్పత్రుల చేతివాటం - రోగుల నుంచి అదనపు వసూళ్లు

"కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన ఓ వ్యక్తికి కిడ్నీలో రాళ్లు ఉండటంతో రాళ్లు తొలగించేందుకు కర్నూలు నగరంలోని జొహరాపురం రోడ్డులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద రూ.30 వేలు మాత్రమే వస్తుందని చెప్పి ఆస్పత్రి యాజమాన్యం అదనంగా రూ.50వేలు వసూలు చేసింది.."

"అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఓ వ్యక్తి ఎపి ఫిస్టులా చికిత్స కోసం కర్నూలు నగరంలోని బళ్లారి రోడ్డులోని ఓ ఆస్పత్రిలో చేరారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద రూ.10 వేలు మాత్రమే వస్తుందని చెప్పి ఆస్పత్రి యాజమాన్యం అదనంగా రూ.10వేలను రోగి నుంచి కట్టించుకుంది."

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) రోగుల నుంచి అదనపు వసూళ్లు జరగకూడదని ప్రభుత్వాధినేతలు, అధికారులు పదేపదే చెబుతున్నా ఆచరణలో అది పూర్తిస్థాయిలో అమలవడంలేదు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 55 ప్రయివేటు ఆస్పత్రులు కాగా మిగతావి ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఎన్‌టిఆర్ వైద్య సేవ అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో (నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో) రోగుల నుంచి అనధికారిక వసూళ్లు చాపకింద నీరులా సాగుతున్నాయి. నాణ్యమైన చికిత్స అందించేందుకు, ఆధునిక పరికరాలను అమర్చేందుకు ఆదనంగా రుసుములు చెల్లించాల్సిందేనని ఆసుపత్రి సిబ్బంది తెగేసి చెబుతున్నారు. దీంతో భయపడి రోగులు వారడిగిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఈ చెల్లింపులకు ఎక్కడా బిల్లులు ఇవ్వడంలేదు. ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రలు ఉంటున్నా, వారిని జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నా.. వసూళ్లు మాత్రం ఆగడంలేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద చేరిన వారు చికిత్సల అనంతరం బయటకొచ్చే వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదు. పూర్తిగా వైద్య సేవ ట్రస్టు ద్వారానే చెల్లింపులు జరగాలి. కానీ ప్రభుత్వం ఖరారు చేసిన ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉన్నాయని, ఖరీదైన చికిత్స అందించేందుకు అదనంగా చెల్లింపులు తప్పనిసరని కొన్ని ఆసుపత్రుల వారు రోగుల నుంచి వేల రూపాయలు లాగుతున్నారు. కర్నూలు జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద నగదు వసూలు చేస్తున్నట్లు ఈ ఏడాది ఇప్పటి వరకూ 174 ఫిర్యాదులు కూడా అందాయి. ముఖ్యంగా ఎముకలు, గుండె, శుక్లం తదితర శస్త్రచికిత్సల్లో ఈ వసూళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఇంప్లాంట్లు, స్టంట్లు, లెన్సులు వంటివి రకరకాల ధరల్లో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు ఖరారు చేసిన ప్యాకేజీ ధరలు తక్కువగా ఉంటున్నాయి. పరికరాలు ఎక్కువ కాలం మన్నాలంటే ఆరోగ్యశ్రీ ప్యాకేజీలకు అదనంగా చెల్లించాల్సి ఉందని రోగులకు చెబుతున్నారు. దీంతో రోగులు ప్రాణభయంతో సరేనంటూ ఆసుపత్రులు అడిగిన మొత్తాన్ని ఇచ్చేస్తున్నారు.

సంతకాలు పెట్టేస్తూ..!

ఆసుపత్రుల నుంచి వెళ్లిపోయే సమయంలో చికిత్స సంతృప్తికరంగా సాగిందని, డబ్బు వసూళ్లు జరగలేదన్న అంగీకారపత్రంపై సంతకాలు పెట్టి ఇళ్లకు వచ్చిన రోగుల నుంచి ఐవీఆర్ఎస్‌ఈపాటు ఏఎన్ఎంలు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ సమయంలో కొందరు ఆసుపత్రుల్లో అనధికారికంగా వసూళ్లు జరిగాయని, బిల్లులు ఇవ్వలేదని చెబుతున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మందుల్లేవు..!

ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద నిర్వహించే చికిత్సలకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉండడంలేదు. వైద్యులు రాసిన మందులు లేవని, మీరు ఒప్పుకొంటే రాసిస్తామని సిబ్బంది చెబుతున్నారు. దీంతో కొందరు రోగులు బయట మార్కెట్లో మందులు కొంటున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల విషయంలోనూ పలుచోట్ల ఇదే జరుగుతోంది. వైద్యులు రాసిచ్చిన మందులు లేకుంటే ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మార్కెట్లో అత్యవసర కేటగిరిలో కొనుగోలు చేసి, రోగులకు అందించాలి. అయితే సూపరింటెండెంట్లు ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

నగదు వసూలు చేస్తే చర్యలు

ఆరోగ్య శ్రీ కింద పేషెంట్ల నుండి నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఆరోగ్య శ్రీ క్రింద చేరితే ఉచితంగా చికిత్స ఇవ్వాలని ఆరోగ్యశ్రీ లేకపోతే అప్పుడు వారి నుండి నగదు తీసుకునే ప్రక్రియను అన్ని ఆసుపత్రులు పాటించాలి. ఆసుపత్రుల ఫిర్యాదులను కేసు వారీగా రివ్యూ చేస్తూ పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ నుంచి తొలగించిన ఆసుపత్రులపై ఏమైన కేసులు ఉన్న వారిపై చర్యలు తీసుకుంటాం.

- పి.రంజిత్ బాషా, కర్నూలు జిల్లా కలెక్టర్.

పరిపూర్ణ ప్రజాస్వామ్యవాది ఏచూరి

- సంస్మరణ సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి- దేవనకొండ

సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న సిపిఎం, సిపిఐ, వైసిపి, ప్రజా సంఘాల నాయకులు

భారత దేశ రాజకీయాల్లో పరిపూర్ణ ప్రజాస్వామ్యవాది, పీడిత ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం దేవనకొండలోని ముగితాత దర్గా ఆవరణలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, విద్యార్థి సంఘం మాజీ నాయకులు, మాజీ సర్పంచి ఉచ్చిరప్ప, వైసిపి మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి నరసరావు, రైతు సంఘం మాజీ నాయకులు ఉప్పర నరసప్పలు మాట్లాడారు. దేశం గర్వించదగ్గ నాయకుడు సీతారాం ఏచూరి అన్నారు. రాజకీయాలు ఏవైనా, సమస్యల ప్రతిపాదికన చట్టసభల్లోనూ, పార్లమెంట్ బయట అణగారిన వర్గాల కోసం, భారత రాజ్యాంగ విలువల కోసం కట్టుబడి పని చేశారని కొనియాడారు. ఏచూరి సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడారని తెలిపారు. విద్యార్థి దశలోనే జెఎన్‌టియు నాయకుడిగా ఇందిరా గాంధీని నిలదీసి విసీ పదవికి రాజీనామా చేయించారని, విద్యార్థి నాయకుడిగా అందరికీ విద్యనదించాలనే పోరాటాన్ని దేశవ్యాప్తం చేశారని పేర్కొన్నారు. తదనంతర రోజుల్లో తిరుగులేని ప్రజా నాయకుడిగా ఎదిగారని చెప్పారు. భారతదేశ మౌలిక పరిస్థితులు, సాంప్రదాయాలను అర్థం చేసుకొని దేశ ప్రజానీకానికి తగ్గట్టు చట్టాలు ఉండాలని పోరాడిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో మూడు తరాల వ్యక్తులతో పని చేసిన సీతారాం తన మేధస్సునంతా ఉపయోగించి భారతదేశానికి విశేష సేవలు అందించారని తెలిపారు. అనేక రైతాంగ, కార్మిక, విద్యార్థి, యువజన ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని విజయాలు సాధించారని చెప్పారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మంచి దౌత్యవ్యక్తగా వివాదాల పరిష్కారకునిగా భారతదేశ ప్రతిష్టను ఇనుమడింప చేశారని పేర్కొన్నారు. ఆయన నడిచిన బాటలో పేద, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడమే ఈరోజు మనందరి బాధ్యతన్నారు. ఏచూరికి నిజమైన నివాళి ఆయన ఆశయాలు ముందుకు తీసుకోవడమేనని అన్నారు. భవిష్యత్తులో వామపక్షాలు ఆయన ఆశయాలు ముందుకు తీసుకోవడంలో అందరూ సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు అశోక్, సూరి, యుసుప్ బాషా, మహబూబ్ బాషా, బజారి, గాజుల శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, నాగేష్, మహేంద్ర, నాగేంద్ర, బలరాముడు, వీరేంద్ర, పరమేష్, జ్యోతి వెంకటేష్, మనోహర్, సుధాకర్, రవి, సుభాన్, సుంకన్న, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

15 శాతం వృద్ధిరేటు సాధించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

జిల్లాలో రానున్న కాలంలో అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధిరేటు సాధించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం వంద రోజుల ప్రణాళిక అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రా-2047 లక్ష్య సాధనలో భాగంగా జిల్లా, మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య విధానం, నైపుణ్య అభివృద్ధి లక్ష్యాలు, సంక్షేమం తదితర శాఖల్లో ఆచరణ సాధ్యం అయ్యే విధంగా, మరింత అభివృద్ధి సాధించే ప్రణాళికలు ఉండాలన్నారు. టమోటా,ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, మార్కెటింగ్ అవకాశాలు పెంపొందించలన్నారు. విద్యా రంగంలో జీరో డ్రాప్ ఔట్స్, రక్తహీనత తగ్గింపు, అక్షరాస్యత పెంపు తదితర అంశాలతో అభివృద్ధి ఎలా సాధించవచ్చు అని ఆలోచించి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నేటి నుండి వచ్చే వంద రోజులకు మళ్ళీ లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించేలా ప్రణాళికలను రూపొందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్వో చిరంజీవి, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

20 నుండి ప్రజా వేదికలు : రాష్ట్ర ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలపై 20 నుండి 26వ తేదీ వరకు ప్రజా వేదికలు (గ్రామ సభలు) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, కరపత్రాలు, డోర్ స్టిక్కర్‌లను అందచేసి కరపత్రంలోని విషయాలను ప్రజలకు వివరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందిని హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

చెరువులు, ప్రభుత్వ భూములను

కబ్జాల నుండి కాపాడాలి

- కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు సమీపంలోని నగర వనం ఎదుట ఉన్న చెరువు, అలుగు వంక, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, చెరువులను, ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎన్. శ్రీనివాస రెడ్డి, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు బి వన్నూరు సాహెబ్, ఎన్ విజయ్ కుమార్, ఎస్ అన్వర్ భాష డిమాండ్ చేశారు. గురువారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ కాలనీల ప్రతినిధులు నగర వనం సమీపం లోని చెరువు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ కబ్జాదారులతో కూటమి ప్రభుత్వం రాజీ పడిందా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వంలా హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి కబ్జాకు గురైన చెరువులను ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిసిందన్నారు. కిలోమీటర్ మేర అపార్ట్మెంట్స్, విల్లాస్ నిర్మాణాలు జరుగు తున్నాయని, ఆ మొత్తం ప్రాంతాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కబ్జాదారులపై చర్య తీసుకోవా లన్నారు. కర్నూలు ప్రజలకు అందుబాటులో ఉన్న ఒకే ఒక్క నగర వనం, దాని ఎదుట ఉన్న చెరువు పచ్చని చెట్లతో అందంగా అహల్లాదకరంగా ఉన్న ప్రాంతం కనిపించకుండా పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో కె.శ్రీనివాసులు, ఎన్.పీటర్, ఎండి యూనుస్, కె.వెంకటరామిరెడ్డి, టి.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నగరవనం వద్ద ఉన్న చెరువును పరిశీలిస్తున్న నాయకులు

'జిఎంఆర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎటువంటి అనుమతులు లేకపోయినా అడ్మిషన్లను నిర్వహిస్తున్న ఎమ్మిగనూరులోని జిఎంఆర్ టిటిసి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల విద్యాశాఖ ఎడి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. నియమ నిబంధనలకు వ్యతిరేకంగా డీసెట్ కౌన్సిలింగ్ కూడా పూర్తయి 2 నెలలు గడిచిప్పటికీ జిఎంఆర్ టిటిసి కళాశాల యాజమాన్యం అనుమతులు తెచ్చుకోలేదన్నారు. ఒక్కో విద్యార్థి దగ్గర రూ.70వేల నుంచి రూ.80వేల వరకు వసూలు చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని టిటిసి కళాశాలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆ కళాశాలపై చర్యలు తీసుకోకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పంచాయతీ కార్యదర్శి కరీమన్నీసా

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి కరీమున్నీసా, మహిళా పోలీసు బి.విజేత తెలిపారు. గురువారం చిట్యాల గ్రామంలో వారి ఆధ్వర్యంలో స్వేచ్ఛతా హీ సేవలో భాగంగా జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. గ్రామం మధ్యలో మానవహారం చేపట్టారు. వారు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి ఆదేశాల మేరకు స్వేచ్ఛాతా హీ సేవ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించడంతోపాటు మన మండలంలో కూడా అన్ని గ్రామాలలో అక్టోబర్ 2 వరకు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. గాంధీజీ 150వ జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించి స్వచ్ఛతా ప్రతిజ్ఞ తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్టోబర్ రెండో తేదీ వరకు గ్రామాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు ప్రజలు భాగస్వామ్యమై తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు.

స్వచ్ఛత వర్సిటీగా మారుస్తాం : ఆర్‌యు వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీని స్వచ్ఛత వర్సిటీగా మారుస్తామని వైస్ ఛాన్సిలర్ ఎన్‌టికె నాయక్ వెల్లడించారు. గురువారం వర్సిటీలో స్వచ్ఛతహే సేవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ, వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులను కోరారు. పరిశుభ్రత వాతావరణం ఉంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, కర్నూలు ఎంపీడీవో అనురాధ, బి తాండ్రపాడు సర్పంచి జయన్న, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల రాతి దూలం పోటీలు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండలం పుట్లూరు గ్రామంలో శ్రీమాతా మారెమ్మ తల్లి తిరుణాల సందర్భంగా ఎద్దుల రాతి దూలం పోటీలు నిర్వహించారు. గురువారం కమిటీ మెంబర్ల ఆధ్వర్యంలో న్యూ కేటగిరి రాతిదూలం పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం ఊడల గురు విజయ కుమార్ రెడ్డి ఎద్దులు 3,829 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.40 వేలు గెలుపొందాయి. నాగర్ కర్నూలు జిల్లా పెంటవెలమ మండలం కొండూరు గ్రామానికి నల్లబోతుల లక్ష్మిగోపాల్ ఎద్దులు 3,811.8 అడుగుల దూరం లాగి రెండో బహుమతి రూ.30 వేలు సొంతం చేసుకున్నాయి. డోన్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కరుణాకర్ ఎద్దులు 3,800 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ.20 వేలు గెలుపొందాయి. కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన ఊరు వాకిలి నడిపి గిడ్డయ్య నాయుడు ఎద్దులు 3,601.2 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.15 వేలు గెలుపొందాయి.

పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అనంతపురం జిల్లా అక్కంపల్లి గ్రామానికి చెందిన కోనపల్లె ఇంద్రారెడ్డి ఎద్దులు 3,480.10 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.10 వేలు గెలుపొందాయి. మొదటి బహుమతి దాతలు మంగలి జగన్మోహన్ రూ.25 వేలు, పెద్దపుల్లన్న రూ.5 వేలు, చెరుకులపాడు బలరాముడు రూ.5 వేలు, ఇస్మాయిల్ బాష రూ.5 వేలు మొత్తం రూ.40 వేలు అందజేశారు. రెండో బహుమతి దాతలు వీరన్న రూ.10 వేలు, మధుసూదన్ రూ.10 వేలు, హరినాథ్ రెడ్డి రూ.5 వేలు, ఉప్పరి జయన్న రూ.5 వేలు మొత్తం రూ.30 వేలు అందజేశారు. మూడో బహుమతి దాత క్రిష్ణగిరి కొత్త బురుజు గోవిందు రూ.20 వేలు, నాలుగో బహుమతి దాతలు చిన్నపల్లన్న రూ.10 వేలు, చెరుకులపాడు కలుగొట్ల కృష్ణ రూ.5 వేలు మొత్తం రూ.15 వేలు, ఐదో బహుమతి దాత మాదాపురం దస్తగిరి రూ.10 వేలు అందజేశారు. ఆలయ కమిటీ మెంబర్లు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బాధ్యతలు చేపడుతున్న జయలక్ష్మి

మార్కెట్ అభివృద్ధికి కృషి

- కర్నూలు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు మార్కెట్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కర్నూలు వ్యవసాయ మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి ఆర్.జయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం వ్యవసాయ మార్కెట్ నుంచి కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే... ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని కార్యక్రమాలతో పాటు గిట్టుబాటు ధరను పొందేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను అమలు చేస్తానని తెలిపారు. సహాయ కార్యదర్శి రెహమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పరిశీలించారు. గురువారం పాతబస్తీ, ఎన్ఆర్ పేట, బంగారు పేట, సంకల్ బాగ్, కల్లూరు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. అలాగే పరిమళ నగర్, సెట్కూర్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్లను పరిశీలించారు.

మేయర్, జెసిని కలిసిన కమిషనర్

నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ బివై.రామయ్యను కమిషనర్ ఎస్.రవీంద్రబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కమిషనర్‌ను డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు జుబేర్ యూనూస్, క్రాంతి కుమార్, కష్ణకాంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సాంబశివరావు, షేక్ అహ్మద్ కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు. అలాగే జెసి డాక్టర్ బి.నవ్యను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధితులకు అంగన్వాడీల సాయం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విజయవాడ వరదల్లో సర్వం కోల్పోయిన వారికి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఆర్థిక సహాయం అందజేశారు. పెద్దటేకూర్ సెక్టార్ అంగన్వాడి టీచర్లు ఆయాలు తమ సాయంగా రూ.10,800 సిఐటియు నాయకులు మహమ్మద్ రఫీకి గురువారం అందజేశారు. వారికి సిఐటియు నాయకులు అభినందనలు తెలిపారు.

పత్తిలో పురుగు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు నివారణపై గురువారం నగరంలోని ఉద్యాన భవన్‌లో జిల్లాలోని ఎఒలకు, సహాయ వ్యవసాయ సంచాలకులకు, జిల్లా శిక్షణ కేంద్ర అధికారులకు, ఆత్మ సిబ్బందికి ఒకరోజు అవగాహన, శిక్షణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి, యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు హాజరయ్యారు. బాలరాజు మాట్లాడుతూ... గులాబీ రంగు పురుగు ఆశించకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఆశించిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి వీడియో రూపంలో వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి మాట్లాడుతూ... గులాబీ రంగు పురుగు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆశించిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి ఎఒలు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు నాణ్యమైన పత్తి ఉత్పత్తిని, అధిక దిగుబడి పొందాలని కోరారు.

బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి

- డిసిసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిసిసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ ఉగ్రవాది అంటూ బిజెపి నేతలు వ్యాఖ్యానించడం తగదన్నారు. దేశంలో అసలు ఉగ్రవాదులు, తీవ్రవాదులు బిజెపి నేతలని విమర్శించారు. దేశంలోని అట్టడుగు వర్గాలకు అభివృద్ధి అందడం లేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని, బిజెపి నేతలు రాజకీయంగా విమర్శ చేయాలి కానీ రెచ్చిపోయే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాషా, జిల్లా కాంగ్రెస్ నాయకులు నర్సింహులు యాదవ్, బజారన్న అనంతరత్నం, అబ్దుల్ రహమాన్, షేక్ ఖాజా హుస్సేన్, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు మురళీకృష్ణ

ముస్లిం సంస్థల్లో రాజకీయ జోక్యం తగదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మస్జిద్ కమిటీలు, ఇమామ్‌లను తొలగించడానికి సంబంధించి ఇతర ముస్లింలకు చెందిన మత సంస్థల్లో టిడిపి నాయకులను చేరవేయరాదని మార్గదర్శకాలు ఇవ్వాలని ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమూద్ పీర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర రాజకీయ నాయకులు మసీదుల, ఇతర ముస్లిం మత సంస్థల కమిటీల్లో జోక్యం చేసుకోవడం వల్ల చాలా మంది వ్యతిరేకించారని తెలిపారు. ఆ పార్టీకి ఓటు వేయకుండా టిడిపికి విజయం అందించారని తెలిపారు. ప్రస్తుతం కొంత మంది టిడిపికి మద్దతు ఇచ్చే ముస్లింలు తమ పంతం నెగ్గించుకోవడం కోసం మస్జిద్, ఇతర ముస్లిం సంస్థల కమిటీలలో ఎమ్మెల్యేలను అడ్డంగా పెట్టుకొని తమ అధికారం మసీదులు, దర్గాలు, మదర్సాలపై పెత్తనం చెలాయిస్తున్నారని, ఇలాంటివి వక్ఫ్ చట్టానికి విరుద్ధమని తెలిపారు. సిఎం చంద్రబాబు ఈ అంశాలపై దృష్టి పెట్టి ఎమ్మెల్యేలను మత సంస్థల కమిటీల్లో జోక్యం చేసుకోకుండా చేయాలని, ముస్లిం సంస్థలను రాజకీయాలను దూరంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఓర్వకల్లులో బైరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలో టిడిపి సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు జరుపుకున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో మునీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 1 తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.శ్రీనివాసులు, నాగేశ్వరరావు, ఎస్.శంకరరెడ్డి, శ్రీరాములు, నాయుడు, వెంకటసుబ్బయ్య, సుందరరావు, చిన్నస్వామయ్య పాల్గొన్నారు.

కెవి.సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ నియామకాలను గురువారం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన పోట్రైన్ ఇన్ఫినిఫ్ఫ్ ఇన్నోవేషన్ కంపెనీ, చెన్నైకి చెందిన సెర్చ్ నీడర్ ఎలక్ట్రిక్ కంపెనీ ప్లేస్మెంట్ ఆఫీసర్స్, హెచ్ఆర్‌లు సయ్యద్ యాసిన్, వంశీకృష్ణ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 116 విద్యార్థులు పాల్గొనగా 62 విద్యార్థులను రూ.2.4 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేశారు. కరస్పాండెంట్ ఎస్ విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ ఉద్యోగం సాధించిన విద్యార్థులు కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చారని అభినందించారు. ఉద్యోగం రానివాళ్లు కుంగిపోకుండా మరొకసారి ప్రయత్నం చేస్తే విజయం సాధించవచ్చని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విజయకుమార్, టిపిఓ ఎస్ సుమయ తబస్సుమ్, సిబ్బంది పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు పొందిన సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఉమాపతి నాయుడు

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. గురువారం ఆదోనిలో మున్సిపల్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ ఇంజినీర్ నాగభూషణం రెడ్డితో కలిసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల ఆకలిని గమనించే అన్న క్యాంటీన్‌ల ద్వారా రూ.5లకే భోజనం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కంకణం కట్టుకున్నారని తెలిపారు. అలాగే ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ ఛైర్మన్ శాంత, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, బిజెపి నాయకులు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, కౌన్సిలర్ పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతలో 75 అన్న క్యాంటీన్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉంటుందని చెప్పారు. టిడిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మీ సలీం, మారుతి నాయుడు, బుద్ధారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో
నైట్ వాచ్‌మేన్ జీతాలు చెల్లించాలి

- సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి రాముడు

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న నైట్ వాచ్‌మేన్ జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.గోవిందు, బి.రాముడు కోరారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే వాచ్‌మేన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని తెలిపారు. రూ.6 వేల వేతనం చెల్లిస్తుందని, అది కూడా నెలనెలా ఇవ్వడం లేదని చెప్పారు. గత ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు పెంచాలని, పని భద్రత కల్పించాలని, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక : ప్రభుత్వ పాఠశాలల వాచ్‌మేన్ అసోసియేషన్ కమిటీ ఛైర్మన్‌గా సి.నారాయణ, కో కన్వీనర్‌గా సమీవుల్లా, ప్రతాప్, కమిటీ సభ్యులుగా మహబూబ్ బాషా, గణేష్, ప్రభాకర్, శ్రీను, వలీ, నాగరాజును ఎన్నుకున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షం

- ఎల్లార్తి దర్గాను దర్శించుకున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు

ప్రజాశక్తి - హోళగుంద

శ్యాంబాబును సన్మానిస్తున్న సిబ్బంది

ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లార్తి షేక్షావలీ, షాషా వలీ సాహెబ్‌ల దర్గాను ఎమ్మెల్యే శ్యాంబాబు దర్శించుకున్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎలాంటి కష్టమొచ్చినా చంద్రబాబు ఉన్నారన్న ధీమా ప్రజల్లో ఉందని చెప్పారు. అనంతరం ఎల్లార్తి దర్గా ఉరుసుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. టిడిపి నాయకులు బత్తిన లోకనాథ్, రామానాయుడు, శ్రీధర్ రెడ్డి, రఘు, చౌదరి, రమేష్, వసీం, చిదానంద, సర్దార్, దర్గన్న పాల్గొన్నారు.

'రెయిన్‌బో' విద్యార్థుల సాయం

- ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

నగదును అందజేస్తున్న యాజమాన్యం

పెద్దకడబూరులోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచారు. గురువారం పాఠశాల కరస్పాండెంట్ గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, పుల్లయ్య, శామ్యూల్ రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 వేల నగదును అందజేశారు. అలాగే మరో రూ.10 వేలు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య అసోసియేషన్‌కు, వరద బాధితుల కోసం పాఠశాల తరపున అందజేస్తామని కరస్పాండెంట్ గోవిందరెడ్డి తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.

అధ్వానంగా రోడ్లు...

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలు
- నాగలదిన్నె ప్రధాన రహదారిలో ప్రయాణికుల ఇబ్బందులు
- కనకవీడు నుంచి పేటకు రహదారిలోనూ పరిస్థితి అంతే..!

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బస్సులు వెళ్ల లేని స్థితిలో రహదారులు ఉన్నాయి. వర్షం కురిసిందంటే చాలు రోడ్డులో ఉన్న గుంతల్లో నీరు నిలిచి కనీసం నడవలేని స్థితి నెలకొంటుంది. ప్రభుత్వాలు మారినా రహదారుల దుస్థితి మారడం లేదని ప్రజలు వాపోతున్నారు.

మండలంలోని కనుకవీడు, పేట, పొనకలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా మారాయి. గ్రామాల్లోని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి రావాలంటే ఆటోలను ఆశ్రయిస్తున్న పరిస్థితి ఉంది. బస్సులు వెళ్లలేని రోడ్డులో ఆటోలో ప్రయాణం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నందవరంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రహదారిలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు బురద, గుంతలో వెళ్లలేక ఆర్ఎంపిలను సంప్రదించి చికిత్స పొందుతున్నారు. ప్రధాన రహదారి ఎమ్మిగనూరు వయా నాగలదిన్నె ప్రమాదాలకు నిలయంగా మారింది. ముగతి వయా నాగలదిన్నె వరకు రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ రహదారి గుంతలమయంగా మారింది. నెలలో కనీసం రెండు ప్రమాదాలైనా జరుగుతున్నట్లు సమాచారం. ఈ రహదారిలో ప్రమాదాలకు గురై చనిపోయిన సంఘటనలూ ఉన్నాయి. ఈ రహదారి ఎమ్మిగనూరు నుంచి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ గద్వాల వరకు వెళ్తోంది. నాగలదిన్నె వంతెన నిర్మాణం పూర్తి కావడం వల్ల భారీ వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారి చిన్నగా ఉండడం వల్ల బస్సులు, లారీల్లాంటి భారీ వాహనాలు ఎదురుగా వస్తే వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామాల్లోని వీధుల్లో రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఏ వీధిలో చూసినా రోడ్లు గుంతల పడి మురుగు నిండి ఉన్నాయి. నందవరం రోడ్డుపై ఎన్ని ప్రమాదాలు జరిగినా, గ్రామాల్లో రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కనకవీడు నుంచి పేటకు వెళ్లే రహదారి

గద్వాల రోడ్డు నిర్మించాలి

- సిపిఎం మండల కార్యదర్శి ఎల్లేష్

ప్రభుత్వం ఎమ్మిగనూరు వయా గద్వాల రోడ్డు నిర్మించాలి. 2009లో సంభవించిన వరదలతో మూడు రాష్ట్రాలకు వారధిగా ఉన్న నాగలాదిన్నె వంతెన కొట్టుకుపోయింది. 14 ఏళ్ల నిరీక్షణ తర్వాత వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెన ప్రజలకు అందుబాటులోకి వచ్చినా రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టాలి.

నాగలదిన్నె రోడ్డును బైపాస్‌గా నిర్మించాలి

- లక్ష్మన్న, రైతు, నందవరం

ఎమ్మిగనూరు వయా నాగలదిన్నె రోడ్డును బైపాస్‌గా నిర్మించాలి. మా పొలం రోడ్డు పక్కనే ఉంది. ఈ ప్రదేశంలో చాలా ప్రమాదాలు జరుతున్నాయి. రోడ్డు చిన్నగా ఉండడంతో భారీ వాహనాలు అటు వైపు వస్తే ఇటువైపుగా ఉన్న వాహనదారులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలూ ఉన్నాయి. రోడ్డును హైవేగా మారిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- సర్పంచి అరుణ్ కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సర్పంచి అరుణ్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో క్రీడాకారులకు హాకీ స్టిక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పూర్వ విద్యార్థులు పెద్దయ్య, ప్రభాకర్, విజయానందం, ప్రతాప్, గోపాల్, శివ, ఖాజా, భీమయ్య, జయరాముడు హాకీ క్రీడాకారులను ప్రోత్సహించాలని సొంత ఖర్చుతో హాకీ స్టిక్స్ విద్యార్థులకు అందించారని తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ చిన్న వెంకప్ప విద్యార్థుల కోసం హాకీ బాల్స్‌ను కొని అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం హాకీ స్టిక్స్ తీసుకున్న క్రీడాకారులు మంచిగా శిక్షణ పొంది మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు, తెర్నేకల్ గ్రామానికి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, కమిటీ ఛైర్మన్ ఉప్పర వీరేష్, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, మాజీ ఎంపిటిసి చాప ఈరన్న, కమిటీ మాజీ ఛైర్మన్ చిన్న ఎంకప్ప, వైసిపి నాయకులు వెంకట రాముడు, ఏసేపు పాల్గొన్నారు.

క్రీడాకారులకు హాకీ స్టిక్స్ పంపిణీ చేస్తున్న సర్పంచి అరుణ్ కుమార్

బిట్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వృత్తి విద్యపై అవగాహన అవసరం

- ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘురావు

ప్రజాశక్తి - ఆలూరు

విద్యార్థులు విద్యతో పాటు వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండాలని ఆలూరు ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్.రాఘవ రావు, ఐటి వృత్తి విద్య ఉపాధ్యాయులు ప్రకాష్ తెలిపారు. గురువారం ఎపి మోడల్ స్కూల్ 9, 10వ తరగతి విద్యార్థులకు, ఆదోని భీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) కళాశాలలో సమగ్ర శిక్ష, లెర్నెట్ స్కిల్స్ వారి సహకారంతో ఫీల్డ్ అవగాహన కోసం కంప్యూటర్ స్కిల్స్ ప్రోగ్రామ్‌పై నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి విద్యపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రీయల్ ఫీల్డ్ ట్రిప్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ప్రత్యక్ష అనుభవాల ద్వారా బోధన చేయడం ఉత్తమ ఫలితాలను ఇస్తుందని చెప్పారు. ఐటి ఒకేషనల్, ఆటోమోటివ్ ఒకేషనల్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ప్రకాష్, శివ, కల్పన, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా బాధితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేసుల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎస్పీలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. గ్రామస్థాయిలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, శాంతిభద్రతల ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. అనంతరం ప్రతినెలా చివరి వారంలో గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం జరిగేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికుమార్ కోరారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని, కౌతాళం మండలంలో తప్పుడు ఎస్టీ సర్టిఫికెట్‌ను ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదోని డీఎస్పీ సోమన్న, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒ కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

అప్పులబాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోని

అప్పులబాధ తాళలేక పొలంలోనే పురుగు మందు తాగి యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నాగలాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు... నరసింహులు (25) తనకున్న 80 సెంట్ల పొలంతో పాటు మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. సరైన దిగుబడి రాక పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడింది. అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైతు నరసింహులుకు భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ప్రస్తుతం 9 నెలల గర్భిణీ. ఆదోని ప్రభుత్వాస్పత్రి వద్ద బంధువులు రోధిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. పోస్టుమార్టం నిమిత్తం నరసింహులు మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

డీఎస్పీ ఉపేంద్ర బాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు డీఎస్పీగా ఎం.ఉపేంద్ర బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి, కోసిగి సిఐ మంజునాథ్, కౌతాళం సిఐ అశోక్ కుమార్, ఎమ్మిగనూరు పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్, మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి, కోసిగి ఎస్ఐ చంద్రమోహన్‌లు డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని మున్సిపల్ డిఇ నీరజ కోరారు. గురువారం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రిసోర్స్ పర్సన్స్‌కు డిఇ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని తెలిపారు. మెప్మా డిపార్ట్‌మెంట్ నుంచి జయవర్ధన్, ప్రదీప్ పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఆకాష్ పూరి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కుమారుడు, నటుడు ఆకాష్ పూరి గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం సహాయక పిఆర్‌ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, పురోహితులు కుర్డీ శ్రీపాదాచార్ (సిపిస్వామి) ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బీందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠంలో జరిగిన రథోత్సవం కార్యక్రమంలో పాల్గొని రథాన్ని లాగారు.

పట్టపగలు ఇంట్లో దొంగతనం

ప్రజాశక్తి - ఆలూరు


బీరువాను పగులగొట్టిన దుండగులు

మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో పట్టపగలే దొంగతనం జరిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితురాల వివరాల మేరకు... గ్రామంలోని జగనన్న కాలనీలో ఉన్న కురువ రామలక్ష్మి భర్త కర్ణాటకలో జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. రామలక్ష్మి తన ముగ్గురు కుమార్తెలను పాఠశాలకు పంపించి కూలి పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడం చూశారు. బీరువా తాళం పగులగొట్టి 9 తులాల బంగారు నగలు, 25 తులాల వెండి, రూ.3.80 లక్షల ప్రామిసరి నోట్లు దొంగలించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో మౌలిక వసతులు కరువు : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ మండిపడ్డారు. గురువారం హైస్కూల్‌లో ఎఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, మండల కార్యదర్శి రమేష్, నాయకులు నవీన్, మహేష్, అనిల్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - కౌతాళం

కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. కోసిగి మండలం కడదొడ్డి గ్రామానికి చెందిన ఈరన్న, కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా వల్లూరు శివారులో పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 9 బాక్సులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సమతుల్య ఆహారంతో రక్తహీనతకు చెక్

- శిశుసంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు రాగిణి వసంత, మహాదేవి

ప్రజాశక్తి - ఆదోని

గర్భిణులు ప్రసవ సమయంలో రక్తహీనత వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, సమతుల్య ఆహారం తీసుకోవడంతో రక్తహీనతను అధిగమించవచ్చని శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు రాగిణి వసంత, మహాదేవి, మెప్మా సిటీ మార్కెటింగ్ మేనేజర్ షమీన తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని మెప్మా కార్యాలయంలో పౌష్టికాహార వారోత్సవాలు జరిగాయి. ఆయా సెంటర్ల నుంచి పిండి పదార్థాలు, ఆకుకూర వంటలు, తిను బండారాలు తీసుకొచ్చి ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పౌష్టికాహార లోపం వల్ల చాలా మంది అమ్మాయిల్లో వయస్సుకు తగ్గ శరీర ఎదుగుదలా జరగడం లేదని పరిశీలనలో తేలిందన్నారు. ఇప్పటికీ కొందరు కిశోర బాలికల్లో నెలనెల రుతుక్రమం సక్రమంగా కాని పరిస్థితి ఉందని తెలిపారు. ఇలాంటి వారు సంతాన లోపం సమస్య ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. పౌష్టికాహార లోపం వల్ల ఈ పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు శరీరానికి సరైన పోషకాలు అందించకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడి ఆరోగ్యం క్షీణించి ప్రాణాపాయం సంభవిస్తున్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు. శరీరానికి కావాల్సిన ప్రోటీన్స్, విటమిన్స్ లభ్యమయ్యే ఆహారం తీసుకునేలా అంగన్వాడీలు, ఆర్‌పిలు చూడాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే పాలు, కోడిగుడ్లు, న్యూట్రీషన్స్ తినేటట్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. టిఎంసి వీరారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నారాయణమ్మ, జావీద్, అరుణ, కృష్ణవేణి ఉన్నారు.

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

పీఠాధిపతులకు గ్రామస్తుల నీరాజనం

- తులాభారం చేసిన శ్రీమఠం సిబ్బంది
- అశ్వ వాహనంపై ఊరేగింపు

తులాభారం నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు గ్రామస్తులు నీరాజనం పలికారు. పీఠాధిపతుల చాతుర్మాస్య దీక్ష విరమణ చేపట్టారు. బుధవారం రాత్రి సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వైస్ ఎంపిపి రాఘవేంద్ర, ఎంపిటిసి వెంకటేష్, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు జనార్ధన్ రెడ్డి, వ్యాపారులు, ప్రజలు గ్రామ సరిహద్దు దాటుతున్న పీఠాధిపతులకు బాణసంచా, పూలమాలలతో, పుష్పాలతో కుంభవృష్టి కురిపించారు. అంతకుముందు శ్రీవాసవీ కల్యాణ మండపం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు బల్ల పరుపులను ఏర్పాటు చేసి, వాటిపై తివాచీలు వేసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇక అక్కడి నుంచి బయల్దేరిన పీఠాధిపతులు కొండాపురం ఆంజనేయ స్వామిని దర్శించుకొని తిరిగి రాఘవేంద్ర సర్కిల్‌కు చేరుకున్నారు. ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించిన అశ్వ వాహనంపై ఊరేగిస్తూ శ్రీమఠం వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం శ్రీమఠం ఉద్యోగులు పీఠాధిపతులకు తులాభారం నాణేలతో నిర్వహించారు.

జీవిత బీమా.. బంగారు భవిష్యత్తుకు ఆసరా...

- ఎమ్మిగనూరు జీవిత బీమా అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్ - 'రావూస్'లో కామర్స్ విద్యార్థులకు జీవిత బీమాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జీవిత బీమా బంగారు భవిష్యత్తుకు ఆసరా అని జీవిత బీమా అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ యు.సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన డిగ్రీ బికామ్ విద్యార్థులకు జీవిత బీమాపై (ఎల్ఐసి) అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంతోష్ కుమార్ హాజరయి మాట్లాడారు. జీవిత బీమా సంస్థలో విద్యార్థుల నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మొదట ఏజెంట్ ఉద్యోగం ద్వారా ప్రారంభమై ఎఇఒ, డిఒ, ఎబిఎం, బిఎం వరకు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని చెప్పారు. ప్రతి విద్యార్థి లైఫ్ ఇన్సూరెన్స్ పట్ల దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఎమ్మిగనూరు ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.రామకృష్ణ మాట్లాడారు. ప్రతి విద్యార్థి కామర్స్ సబ్జెక్టులో వివిధ రకాలైన ఇన్సూరెన్స్ పాలసీలకు సంబంధించిన అనేక విషయాలను తెలుసుకోవడం వల్ల జీవిత బీమా పట్ల అవగాహన ఏర్పడుతుందని సూచించారు. కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి మాట్లాడుతూ... జీవిత బీమా కుటుంబ బంగారు భవిష్యత్తుకు ఆసరా అని తెలిపారు. ప్రతి కామర్స్ విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ టెక్నికల్ స్కిల్స్‌ను వృద్ధి పరుచుకొని అడుగులు ముందుకు వేయాలని కోరారు. ఎమ్మిగనూరు ఎల్ఐసి అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పరమేశ్వర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, బికాం హెచ్‌ఒడి విజయ్ కుమార్, కామర్స్ అధ్యాపకులు వీరేష్, వెంకటేశ్వర్లు, గోరంట్ల, రామకృష్ణ, నందిని, పాల్ రాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం...

- జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వైద్య చికిత్సలకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని, ఎలాంటి సంఘటన జరిగిన నాయకత్వం దృష్టికి తీసుకురావాలని జనసేన మండల, పట్టణ అధ్యక్షులు ఎం.తాహేర్ వలీ, మలిశెట్టి రేణువర్మ తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న నెట్టేకల్లు గ్రామానికి చెందిన వడ్ల సత్యనారాయణ వృత్తి ఆధారంగా ప్రమాదం జరిగితే వైద్య ఖర్చుల కోసం జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప ఆదేశాల మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో రూ.25,048 చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి గురించి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును ఆదోని ఇన్‌ఛార్జీ మల్లప్పకు పంపినట్లు చెప్పారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. సీనియర్ నాయకులు గాజుల రాజశేఖర్, మండల నాయకులు పులిరాజు, లోకేష్, ప్రకాష్, జయరాం, చిరుత రాజశేఖర్, ఉరుకుంద, వెంకటేష్, గోపాల్, మల్లికార్జున, బాష పాల్గొన్నారు.

మల్లెల గ్రూపు సేకరించిన
నిత్యావసర వస్తువుల తరలింపు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాహనంతో మల్లెల గ్రూప్ ఛైర్మన్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మల్లెల గ్రూప్ ఛైర్మన్, సామాజికవేత్త, అంబేద్కర్ రత్న అవార్డు గ్రహీత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు అధ్వర్యంలో సేకరించిన నిత్యావసర వస్తువులు, నగదును విజయవాడకు తరలించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మల్లెల గ్రూప్ ఛైర్మన్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు చేతుల మీదుగా వాహనాన్ని ప్రారంభించి పంపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ వాహన ఖర్చు ఏర్పాటు చేశారు. దాదాపు రూ.8 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులు, రూ.50 వేల నగదు పంపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, మల్లెల గ్రూప్ సభ్యులు శంకర్, రవి, ముత్తు సమాల, నరసింహ రెడ్డి, సామాజిక కార్యకర్త గ్రందే గిరి పాల్గొన్నారు.

ప్రమాదకంగా ఉన్న భవనాన్ని మార్చాలి

- సబ్ కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని మైనార్టీ కాలనీ వద్ద ఉన్న ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ భవనం పైకప్పు పెచ్చులూడి ఉందని తెలిపారు. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. భవనాన్ని పరిశీలించి మరోచోటకు మార్చేలా చూడాలని కోరారు. విద్యార్థులకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే విద్యార్థులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్ఐ పట్టణ నాయకులు శశిధర్, దేవరాజ్, గణేష్, యశ్వంత్, ప్రతాప్, రాజు పాల్గొన్నారు.